# వీపుమీద విమానం

వీపుమీద విమానమేవిటనితెల్ల బోతున్నారా చెప్తా-చెప్తా-మీచంటాడో చంటిదో విమానం కోసం ఎడిచి అల్లరి చేసినపుడు మీరో. విమానం ఆటని వెంటనే ఆలోచించాలి కదా అప్పుడు మీ వారిని హాల్లో చాపమీద బోర్లా నాలుగు పాదాల మీదా పారాడే కృష్ణుడి బొమ్మలా పడుకోమనాలి. ఒకవేళ పడుకునుంటే కాస్సేపు పారాడే కృష్ణుడిలా వుండమనండి. అప్పుడు మీ బాబ్జీగాడిని మీరెత్తుకొచ్చి మీవారి వీపుమీద పడుకోబెట్టి నాన్నా చేతుల్ని చాపినప్పుడల్లా మీవారు నోటితో "బొంయ్ బొంయ్ బొంయ్"మని ఇంజన్ బయల్దేరిన చప్పుడు చేస్తూ గదిలో యిటూ అటూ గుండ్రంగానూ అడ్డం గానూ, నిలువుగానూ తిరగాలి. మీ బాబ్జీ క్రింద పడిపోకుండా కాళ్ళతో కప్పలా మీవారి నడుంచుట్టూ వాటేసుకుని పట్టుకోవాలి. ఈ ఆట మీరు ఆడిస్తూంటే మీవారు నోటితో విమానం చేసే చప్పుళ్ళన్నీ చేస్తూ వుంటారు. అప్పుడు మీరు గుమ్మం దగ్గిర నిలబడి అలవోకగా నవ్వుతూ ఆనందించాలి. ఈ ఆట విజయం అంతా మీరు మీవారిని పారాడే కృష్ణుడి బొమ్మలా చాపమీద పడుకునేలా చేయటంలో వుంది కిటుకు. చల్ చల్ గుర్రం ఆటని కొంచెం మారిస్తే వీపు మీద విమానం ఆట వస్తుంది. మీవారు కాస్త ఏమరుపాటుగా వుంటే మీ బాబ్జీ వీపు మీదెక్కి విమానం ఆట ఆడుకుందాం రమ్మని మీ వారిని చంపుకు తింటాడు. మీ వారికి

మిమ్మల్ని చూసినా బాబ్జీని చూసినా లోపల నుంచి గుండెదడ బయల్దేరుతుంది. అసలు చాపమీద పడుకోరు పడుకున్నా వెల్లకిలా తప్ప బోర్లా అసలే పడుకోడు. ఈ విమానం ఆట ఎక్కడ మొదలవుతుందోనని బెంగ పెట్టుకుని చక్కగా ఖాసింపట్టు వేసుగుని కూర్చుంటాడు. ఒకవేళ విస్కుంటే చిన్న పిల్లాడు దగ్గరికొస్తే విసుక్కుంటా రేవిటి అని మీరే అతని నోట్లో గడ్డి పెట్టొచ్చు.

మీవా రెప్పుడూ కుర్చీమీదా, మంచం మీదా కూర్చుని కాళ్ళూపుతారనుకోండి. అప్పుడు మీ బాబ్జీని పిల్చి వెళ్ళి నువ్వూ నాన్నగారూ వుయ్యాల ఆట ఆడుకోండమ్మా అని మీరు పిల్లడిని పురుషుడి మీదకు వుసిగొలిపి చక్కగా పిండి విసురు కుంటూనో చేటలో పప్పులు పోసుకుని చెరుగు కుంటోనో ఆ గదికీ మధ్య గుమ్మంలో కూర్చుని జరిగే తమాషాని గమ్మత్తుగా క్రీగంట గమనించండి "వీడేవిటే వుయ్యాల ఆటఅంటాడూ" అని మీవారు యిబ్బందిగా మొహం పెట్టి అడుగుతారు. మీరు మాట్లాడకుండా వినపడనట్లు వూరుకోండి. మీబాబ్జీ బింకలా పట్టుకుని వదలడు "మన యింట్లో వుయ్యాల లేదమ్మా" అని నారు గుంటడిని బుజ్జగిస్తూ వుంటారు. వాడు గీమని అరిచి గొడవచేశాక కాస్సేపు కాళ్ళమీద కూర్చో పెట్టుకుని ఆడించండి అని మీరు యథాలాంపగా అన్నట్లు అనేసి "వెళ్ళమ్మా నాన్నగారు కాళ్ళమీద కూర్చో పెట్టుకుని వూపుతారు" అని మీ వాడికి నచ్చచెబుతున్నట్లు చెప్పండి. మీ బాబ్జీ వెళ్ళి మీవారి పాదాల మీద కూర్చుని గట్టిగా మోకాళ్ళను కరుచుకుంటాడు. అప్పుడు మీవారు కాస్సేపు కాళ్ళను వూపుతూ పళ్ళు గట్టిగా కరుచుకోవడం ఆరంభిస్తారు. బాబ్జీ "మళ్ళీ వూపు" మళ్ళీవూపు అంటూ మీవారిని విడిచి పెట్టడు. వువుంగ వుడికికాళ్ళు లాక్కు వస్తున్నా బాబ్జీ దిగడంటే దిగడు. ఈఆట ఒక పావు గంటఇరవై నిముషాలయే సరికి మీవారు "కాఫీ" అని అరవకపోతే ఒట్టు మీవారికి ప్రాణ సంకటంగా తయారయినప్పటికీ మీకు చాలా ఎంటర్‌టెయినింగుగా వుంటుంది. ఒకవేళ వెల్లకిలా పడుకుందామని ఆ మానవుడు ఎక్కడైనా వెల్లకిల పడినా మీ బాబ్జీ వెళ్ళి కాళ్ళకు కప్పల్లా కరుచుకుని

పుయ్యాలాట ఆడించమని పీక్కు తింటాడు. కొన్నాళ్ళదాకా ఈ ఆట పేరు చెపితే మీ వారికి కాళ్ళు ఫీకుతాయి. బాబ్జీని చూడగానే వాడు మీద పడటానికి లేకుండా ఠక్కున పోలీసు జవానులా లేచి నిలబడతారు మీ వారు ఎక్కడున్నా సరే. ఇలా మీవారు నిలబడిపోయి ఇంట్లో తిరుగుతున్నప్పుడుఅతగాడిని హడల కొట్టడానికి మరో చిన్న ఆట వుంది.

మీ హాల్లోగాని సావిట్లోగాని మీ బాబ్జీని రెండు రెక్కలూ పుచ్చుగుని గుండ్రంగా తిప్పి ఆడించమనండి. మీవారు రెండు మూడు నిమిషాలు



గుండ్రంగా తిరిగేసరికి కళ్ళు తిరిగి "అమ్మో! అయ్యో?" అంటూ తల పట్టుకుని కళ్లుమూసుగుని కూలబడతారు. లేవండి ఓవల్టిన్ పుచ్చుగోండి అన్నా ఇప్పుడొద్దే అని చేత్తోనే వారిస్తారు. మీరు జాలిపడ్డారా కొంప మునుగుతుంది.

ఈ ఆటల వలన లాభమేమిటి అని అడక్కండి. మీ గృహలక్ష్మి పతి యింట్లో మీ కంటి ముందు పిల్లలిని ఆడిస్తూ చరణదాసుడిలాగపడి వుండటం కంటె మీరు కోరుకోదగిన ఆనందం ఏవిటి? మీరన్నా మీ పిల్లలన్నా మీ వారికి భయమూ భక్తీ ఏర్పడటానికింత కంటె సులువైన మార్గం కనిపించటం లేదు మీ వారు సైకిల్మీద చెప్పకుండా మార్నింగ్ షోలకి గట్రా వుడాయించే సరుకైతే మీ బాబ్జీకి సైకిల్ గాలి ఎలా వూద

తీయాలో చెప్పండి. మీరు హస్తలాఘవం కలవారైతే పర్సులోంచి నోట్లన్నీ తీసి సుబ్బరంగా చీటీ కట్టేయండి. జేబులు కొట్టేయడం నేర్చిన ఆడవాళ్ళు అవే ముత్తాల్ని అవే మొగుళ్ళకు చక్రవడ్డీకి తిప్పి నెక్లెసులూ రవ్వల దుద్దులూ చేయించుకున్న వాళ్ళని నేనెరుగుదును. స్త్రీ సర్వశక్తి స్వరూపిణికదా- ఆమె తల్చుగుంటే చేయలేనిదంటూ వుండదు. కాని తల్చుగోదు.

మీ యింట్లో అటకగాని వుంటే మీకు చాలా లాభం. అందులో మీవారి కుపయోగించే వస్తువులు కొన్నిటిని భద్రం చేయండి. అప్పుడప్పుడు మీ వారిని అటక ఎక్కిస్తూ వుండండి. ఒకవేళ అటక లేకపోతే స్టోర్‌రూం వుంటుందిగదా—అందులో మినిమం ఒక అరపూట లేదా ఏడెనిమిది గంటలు గడిపేలా వారికి హోంవర్క్ యివ్వండి. హోం వర్క్ లేకపోతే స్కూలు పిల్లలు చెడిపోయినట్లుగానే మగవాళ్ళూ చెడిపోతారు.

ఇవి స్కూళ్ళు తెరిచేసిన రోజులుకదా. ఇరుగు పొరుగు పిల్లలకి మోయలేనన్ని పుస్తకాలు వాళ్ళ వాళ్ళు కొంటారు కదా! మీ వారికి అట్టలు బాగా వేయటం వచ్చని చెప్పండి. ఇహ చూసుకోండి తమాషా. చుట్టుప్రక్కల పిల్లలంతా చేరి మీ వారిని పుస్తకాలకు అట్టలు వేసిపెట్టమని వచ్చి కూర్చుంటారు. ఆప్పుడా మానవుడు చావకి అంటుకుపోతాడు. పిల్లలు చుట్టూచేరి కదలనివ్వరు. అతగాడు విసుక్కుంటే పరోపకారం అంటే వూర్లోంచి పారిపోయే రకం అని మీరు తిరగబడండి. తగ్గుతాడు. తగ్గక తప్పదు. మీరెప్పుడూ ఎగస్పార్టీలో జేరిపోతూంటే మీ అనుగ్రహం సంపాదించేందుకై అతను ఎన్నిపాట్లయినా పడ్తాడు. దెబ్బలాట ఎప్పుడూ సాయంత్రం పెట్టుకోవాలి, సూర్యుడు అస్తమించే టైం కదా!

లేకపోతే అతని స్నేహితులు మీ యింటి కొచ్చినపుడు మీరు ముక్కిపోయిన గోధుమ రవ్వతో ఉప్మాచేసి పెడతారేమోననే భయం అతనికి వుండనే వుంటుంది. భర్తలను లొంగదీసుకొనటానికి పిల్లలను

ఆటంబాంబుల్లా వుపయోగించుకోవాలి. వీపుమీద విమానం ఆట గురించి కాని, కాళ్ళమీద వుయ్యాలాట- గుండ్రంగా పిల్లడిని తిప్పటం గురించికాని అతనుపడే బాధ ఎవరితో చెప్పుకోలేడు. ఇది తగుమాత్రం హింసే నిజంగా గెస్టులను తీసుకొచ్చి, పీకమీద కూర్చోబెట్టి, వేళాపాళా లేకుండా యింటికొచ్చి సినిమాలకు షాపింగులకు మీతో వస్తానని చెప్పి ఎగొట్టి అతను మిమ్మల్ని హింసించినందుకుగాను యిది టిట్ ఫర్ టాట్! ఇవన్నీ ఒక్కమారే ప్రయోగించకండి. అతను బెదిరిపోయి సన్యాసుల్లో కలిసి పోవచ్చు. అయితే ఇందులో మీ పాత్ర చాలా నిమిత్తమాత్రంగా వుండాలి. మీరు "ఇహ్హిహీ" అంటూ నవ్వటం ప్రారంభిస్తే మీ నెత్తిమీది మొట్టికాయలు పడవచ్చు. మీరు పెళ్ళికూతుర్లా తలకాయ వంచుకుని మీ బుర్ర లోని ఆలోచనల్నన్నీ ఒక్కొక్కటొక్కటే అమల్లో పెట్టాలి. దీనికేమీ తెలీదు, యిది బి.గ్రేయూస్ అనుకుంటూనే అతను గోతుల్లో పడుతూ వుంటాడు. మీ ప్రోగ్రాం వీపుమీద విమానంతో ప్రారంభించండి ఇంతకీ మీ యింట్లో పారేడు కృష్ణుడి బొమ్మ వుందా లేదా?